పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



రాగిచెట్టుకు పురుగుల మందు పిచికారీ చేస్తున్న జీహెచ్ఎంసీ కార్మికుడు,బీజేపీ నేతలు

కవాడిగూడ: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కవాడిగూడ బీజేపీ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్ సూచించారు. బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఉన్న భారీ రాగిచెట్టుకు పురుగుపట్టింది. దీంతో రెండు అంగన్‌వాడీ సెంటర్ల విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా మంగళవారం రాగిచెట్టుకు పురుగుల మందు పిచికారీ చేయించారు. స్థానికులు అంగన్‌వాడీ టీచర్లు ఫిర్యాదుతో వెంటనే స్పందించిన బీజేపీ నేతలకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

కార్మిక పక్షపాతి రాంరాజయ్య



రాంరాజయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న కామల్ల ఐలయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నిరాడంబరుడు, కార్మిక పక్షపాతి రాంరాజయ్య అని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం అధ్యక్షులు కామల్ల ఐలయ్య అన్నారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో కార్మిక నాయకుడు రాంరాజయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. మంచిర్యాల పట్టణంలో కార్మికుల కోసం నిరంతరం శ్రమించిన గొప్పవ్యక్తి రాజయ్య అని సింగరేణి కార్మికుడుగా ఉద్యోగానికి రాజీనామా చేసి భవన నిర్మాణ రంగంలోకి వచ్చి కార్మికులకు అనేక సేవలు అందించారని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్రం కోసం కార్మిక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో కార్మిక సంఘాన్ని నిర్మించడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేసినప్పుడే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో కోటం రాజు, తాటికొండ మధు, సంపత్, పిల్లి హరిచంద్ర, పగడాల రామన్న, యాదగిరి, రాజేందర్, వెంకటరమణ, శ్రీనివాస్, ఈశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌లో ప్రతిభ చూపిన అభ్యర్థులకు సన్మానం



చిక్కడపల్లి: క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే తప్పకుండా పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారని ప్రముఖ విద్యావేత్త, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్స్-1 మెయిన్స్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన అభ్యర్థులను మంగళవారం సాయంత్రం గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో బాలలత సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంస్థ నుండి భారీ సంఖ్యలో అభ్యర్థులకు ఉత్తమ మార్కులు రావడం చాలా సంతోషంగా వుందన్నారు. వీరంతా ఉద్యోగాలు సాధించి ప్రజలకు ఎరుగైన సేవలు అందించే విధంగా ముందుకు సాగాలని ఆమె కోరారు. వీరితో పాటు అకాడమీ డైరెక్టర్ ఎం.ఉమేష్‌రెడ్డి, గ్రూప్స్ ఇన్‌చార్జి ఆర్.నాగరాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చిక్కడపల్లి: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని జనప్రియ అబోర్డ్స్‌లో పీపుల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీజే మన్మోహన్, డాక్టర్ బాషా, డాక్టర్ పల్లవి స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత వినయ్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలుఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం ... గుర్తుతెలియని వ్యక్తి (50) ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తనివ్వం

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



కవాడిగూడ ఆర్యసమాజ్ గల్లీలో అధికారులతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని జల మండలి అధికారులు ఎక్కడ కూడా మంచినీరు కలుషితం కాకుండా యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ రీజినల్ ఇరిగేషన్ కార్పొరేషన్ (టీజీఆర్‌ఐసీ) స్కీమ్ కింద కవాడిగూడ ఆర్యసమాజ్ గల్లీలో చేపడుతున్న మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునీకరణ, వీడీసీసీ రోడ్ల నిర్మాణం ఆలస్యం అవుతోందని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మంగళవారం ఆర్యసమాజ్, కుమ్మరిబస్తీ, తదితర ప్రాంతాలలో జలమండలి అధికారులతో కలిసి పాదయాత్ర చేసి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

◆ ఈ సందర్భంగా స్థానికులు మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ ఆధునీకరణ కోసం రోడ్లను తవ్వి దాదాపు నెలరోజులు గడుస్తున్నా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. నిర్మాణం చేపట్టే కాంట్రాక్టు సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. దాదాపు నెలరోజుల క్రితం తవ్విన రోడ్లతో నిర్మాణ పనులు ముందుకు సాగక నిలిచిపోయాయి. దీంతో నిత్యం రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లను ఇష్టానుసారంగా తవ్వి వదిలివేయడంతో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయి కలుషిత నీరుసరఫరా అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లోప్రెషర్ నీటి సమస్యతో కూడా ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. డ్రైనేజీ పైప్‌లైన్లను ఆధునీకరించిన తర్వాతనే సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. సంబంధిత కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, శ్రీహరి, మేకల శ్రీనివాస్, రవి, మంజుల, రూప, రాజు యాదవ్, శివ, జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు
ఉద్యమాలను ఉధృతం చేయాలి



చిక్కడపల్లిలోని ఎన్‌పీఆర్‌డీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జ్యోతి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మహిళా హక్కుల సాధన కోసం ఉద్యమాలను ఉధృతం చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి పిలుపునిచ్చారు. మహిళల రక్షణ ప్రభుత్వాలకు పట్టదా అని ప్రశ్నించారు. మంగళవారం చిక్కడపల్లిలోని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కార్యాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 21 నుంచి 23వ తేదీలలో మహిళా వికలాంగుల సంక్షేమం, సాధికరాత అనే అంశంపై జరగబోయే సదస్సు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ... మహిళలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో సమాన భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 10ఏళ్ల బీజేపీ పాలనలో మహిళలపై 28శాతం నేరాలు పెరిగాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి మహిళలకు ఉన్న రక్షణచట్టాలను పటిష్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, ఎం.అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్, జె. రాజు, దశరత్, శశికళ, దీపికా తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో యోగా చేస్తున్న డాక్టర్ అలివేలు మంగ

ముషీరాబాద్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని హోమియోపతి వైద్యాధికారి డాక్టర్ అలివేలు మంగ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీ ఆవరణలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ శిబిరంలో వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. అలివేలు మంగ మాట్లాడుతూ.. ఆయుష్ పథకం ద్వారా ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతి రోజు రెండు గంటల పాటు అనుభవజ్ఞులైన యోగా మాస్టర్లచే యోగా నేర్పిస్తున్నామని అన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు యోగా శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ నిఖిల్, ఆసుపత్రి పీహెచ్ఎన్ ఫిల్లిన్స్ ఏఎన్ఎం విజయకుమారి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

కాచిగూడ: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని ఈనెల 18, 19వ తేదీల్లో చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ మహిళా ప్రధానకార్యదర్శి మట్టా జయంతి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం చలో ఢిల్లీ జాతీయ మహిళా సదస్సు పోస్టర్‌ను టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం కాచిగూడలో వారు మాట్లాడుతూ.. జాతీయ జనగణనలో కులగణన చేపట్టాలన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని చలో ఢిల్లీ, జాతీయ మహిళా సదస్సును విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తంగెళ్లమూడి నందకుమార్, పగడాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయంలెక్కింపు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం నాలుగున్నర నెలల హుండీ డబ్బులు మంగళవారం లెక్కించగా రూ.3,11,574 ఆదాయం వచ్చింది. దేవాలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని, భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తామని చైర్మన్, ఈవోలు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ ఎం.నర్సింగ్‌రావు,ఈవో పి.లక్ష్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ పి.అండల్, కమిటీ సభ్యులు గుర్రం దినేష్, డి.బానుచందర్,బంజారు నవీన్, అర్చకులు ఇ.కాశీనాథశర్మ, భవనందశర్మ, వేణుగోపాలచారి పాల్గొన్నారు.

పెయింటర్ ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన కావేటి శంకర్ (58) ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో నమోదు

కాచిగూడ: ఓ బాలికపై దాడిచేసిన యువకుడిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న తెలిపిన వివరాల ప్రకారం.. అఫ్జల్‌గంజ్ ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి సంతోష్ (30)కి బాలిక (17)తో మూడేళ్లుగా పరిచయం ఉంది. మరో యువతితో చనువుగా ఉండటంతో బాలిక అతడికి దూరంగా ఉంటోంది. అందుకు ఆగ్రహించిన అతడు మంగళవారం బాలిక చదువుకుంటున్న కాలేజీకి వచ్చి వేధించడమే కాకుండా దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అతడిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు.

ఓబీసీ ఉద్యోగులకు క్రీమిలేయర్‌ను ఎత్తేయాలి



జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న రవికుమార్ ముదిరాజ్,దానకర్ణచారి

కాచిగూడ: ఓబీసీ ఉద్యోగులకు క్రీమిలేయర్‌ను ఎత్తివేయాలని ఆల్ ఇండియా ఓబీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు రవికుమార్ ముదిరాజ్ (హెచ్ఏఎల్), దానకర్ణచారి (బీడీఎల్), రాంమూర్తి (పోస్టల్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌కు వచ్చిన జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్ ఆహిర్‌ను వారు కలిసి ఓబీసీల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఓబీసీల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని వారు కోరారు. దేశ వ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షలకు హాజరవుతున్న ఓబీసీ విద్యార్థులకు పరీక్ష ఫీజులను ఎత్తివేయాలని కోరారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అన్నారు.

18నుంచి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు

ముషీరాబాద్: దేశం కోసం నవ్వుతూ ఉరికంభం ఎక్కిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సభలు రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల్లో, గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృతంగా జరపాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి పోస్టర్లను సోమవారం మార్క్స్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం తమ ప్రాణాలను తుణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాన్ని నాటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో పివైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవికుమార్, బి.ఎస్.కృష్ణ, పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎస్.రాకేష్, బి.దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

15న జిజ్ఞాస పరిశోధనాత్మక వ్యాసాల కార్యశాల



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వసుంధర, విజయకుమార్

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో జిజ్ఞాస పరిశోధనాత్మక వ్యాసాల కార్యశాలను ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు వేముల విజయకుమార్, సమన్వయకర్త నిష్టల సుధామాల, మధుమతి కులకర్ణి తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలో ఈ కార్యశాల వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర సమితి సభ్యులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ శాస్త్రీయ నృత్యరీతులలోని వైశిష్ట్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి పరిశోధనా అంశాలను ఏ విధంగా ఎంపిక చేసుకోవాలనే విషయాలను వివరిస్తారని తెలిపారు. ఈ వర్క్‌షాప్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

'ఎంకే రాము గీతాలలో సామాజిక చింతన ఉంటుంది'

జస్టిస్ చంద్రకుమార్



ఎంకే రామును సన్మానిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, రామాచారి, వేణుగోపాలాచారి

చిక్కడపల్లి: కవి, రచయిత డాక్టర్ ఎంకే రాము రాసిన లలిత గీతాలలో సామాజిక చింతన ఉంటుందని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి ఆధ్వర్యంలో కవి, రచయిత ఎంకే రాము పుట్టినరోజును మంగళవారం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై రాము రాసిన గీతాలను విన్నారు. ఈ సందర్భంగా లలిత సంగీతానికి పట్టాభిషేకం శీర్షికతో లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ రామాచారి శిష్యబృందం సురేఖ, శశికళ శ్రావ్యంగా ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, అధికారి నరసింహప్ప, వంశీ సంస్థల అధినేత వంశీరామరాజు, నేటి నిజం సంపాదకుడు బైసాదేవదాసు, కథక్ నృత్యకారుడు పండిట్ అంజుబాబు, సంగీత స్వరకర్త పీవీ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యతో ఇబ్బందులు



జలమండలి అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: మంచినీటి సమస్యతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సమస్యను గుర్తించి సత్వరమే పరిష్కరించి నీటి సమస్య లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ జలమండలి అధికారులకు సూచించారు. మంగళవారం జలమండలి డీజీఎం కృష్ణ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌లతో కలిసి డివిజన్ పరిధిలోని మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్న చెప్పల్‌బజార్, మణియార్ పట్టి, మోతీమార్కెట్, సునార్‌లేన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులు కొంత కాలంగా లోప్రెషర్‌తో నీటి సరఫరా కావడంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పాటిల్, అశీష్, బి.భీమ్‌రాజ్, రూప్‌కిరణ్, ఆర్.సంతోష్, సూరి, రవియాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఈ తీర్పు కుల దురహంకారులకు గుణపాఠం కావాలి'



నారాయణగూడలోని డీబీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

కాచిగూడ: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు పరువు హత్యలు చేస్తున్న కుల దురహంకార ముఠాలకు ఒక గుణపాఠం కావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. మంగళవారం నారాయణగూడలోని డీబీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కిరాతక హత్య కేసుని విస్తృతస్థాయిలో విచారణ చేసి హంతకులకు శిక్షలు పడే విధంగా విధులు నిర్వర్తించిన పోలీసు అధికారులకు అభినందనలు తెలియజేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు, బిహారీ సుపారీ గ్యాంగ్‌స్టర్ కిరాయి హంతకుడు సుభాష్ శర్మకు ఉరిశిక్ష, మిగతా నిందితులకు జీవిత ఖైదు విధించడంతో దోషులందరికీ సరైన శిక్షలు పడ్డాయని ఆయన తెలిపారు. ఈ తీర్పును మొత్తం దళిత సమాజం స్వాగతిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గోలి నరేష్, మద్దెల ప్రవీణ్ కుమార్, సత్యనారాయణ, బండారి లావణ్య, సీహెచ్ రోజా లీల, ఎం.పద్మ, జి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి



డాక్టర్ కృష్ణకుమారి, ముక్తేవి భారతికి ఆత్మీయ సత్కారం చేస్తున్న జస్టిస్ రాధారాణి

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ కమలాకర చారిటబుల్ ట్రస్టు, లయన్స్ క్లబ్ ఆఫ్ సంస్కృతి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో అంతర్జాతీయ ఉమెన్స్ డే వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని కోరారు. తొలుత 'రమణీ రామాయణం'ఆధ్యాత్మిక సాహిత్య రూపకాన్ని ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. అనంతరం డాక్టర్ కృష్ణకుమారి, ముక్తేవి భారతికి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి ప్రముఖులు సముద్రాల వేణుగోపాలాచారి, ఏపీ అధికారభాషా సంఘం పూర్వ అధ్యక్షుడు విజయబాబు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎస్.అనంతలక్ష్మి, భారతీకమలాకర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారతకు చదువే కీలకం: రచయిత్రి డా. ముక్తేవి భారతి

కాచిగూడ: మహిళల సాధికారతకు విద్య అత్యంత కీలకమని ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముక్తేవి భారతి అని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పాత్ర మరింత బలోపేతం చేయాలంటే మహిళలు స్వయం సంపన్నులు కావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మహిళలు తమ అభ్యాసం, ఆత్మవిశ్వాసం ద్వారా అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళా విద్యావేత్తలైన డాక్టర్ గీత (కెమిస్ట్రీ), డాక్టర్ గ్రేస్ (ఇంగ్లీష్), డాక్టర్ శారద (గణితం) లను ఘనంగా సత్కరించి అభినందించారు. కళాశాలలో వీరు అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. పదవి విరమణ చేసిన డాక్టర్ ప్రసూనా, విమలలను కళాశాల తరపున సత్కరించారు. మహిళా సాధికారతపై కృషి చేసిన విద్యార్థినులకు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ప్రొఫెసర్ సుదర్శన్‌రెడ్డి, హెచ్ఎంవీఎస్ సెక్రటరీ ప్రొఫెసర్ ముత్యంరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సింధూరి తదితరులు పాల్గొన్నారు.

చాత్తాద శ్రీ వైష్ణవ మహిళలకు సన్మానం

నల్లకుంట: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. మంగళవారం న్యూ నల్లకుంటలోని నర్మదా భవన్‌లో విజేతలకు బహుతుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను శాలువాతో సన్మానించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు బిక్కుమళ్ల నిర్మల, ఉపాధ్యక్షులు తులసి సత్యనారాయణ, అయ్యగారి పాండు, ప్రధాన కార్యదర్శి వెంకటయోగి వెంకటేశ్వర్లు, సంప్రదాయ కార్యదర్శి వకుళాభరణం సంతోషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్



రెడ్డి కళాశాలలో మహిళలకు సన్మానిస్తున్న ప్రొ. సుదర్శన్‌రెడ్డి, ప్రొ. ముత్యంరెడ్డి తదితరులు